

55వ పేజీ తరువాయి

సంతోసే కదా– ఒట్టి దారం అదెంత జిగేలుమన్నా జడలో తురుముకోరు కదా!'

'అలా అని విడిపూలు ఎన్నున్నా విరులా విరులయ్యేది దండకట్టాకే!' అన్నాడతను.

'ఒయ్ రామకృష్ణా– దండ ..కైదండ..అండ దండ అంటూ పెద్ద పెద్ద మాటలు వద్దు. జత అను బావుంటుంది. ఆడ మగ లాగా దండ–అదే పూలదండ అందగిస్తుంది–'

'ఒకే... ఒకే...'

'నువ్వంటున్నది ఓకేనా... లేక ఒకేనా...?'

'బాబ్బాబూ మీకు పుణ్యం వుంటుంది. మాటలు తాళింపు పెట్టకండి'

'ఇంపుగా మీరిద్దరూ కలిసి కాపురం చేస్తే మేం ఎందుకు?'

తలొంచుకున్నాడతను.

'ఇదో– నువ్వేం తప్ప చేశావని తలొంచుకోవాలి–'

చప్పన తలెత్తాడు. "ఆదేం లేదండి! తలొగ్గాను తప్ప ఎప్పడూ నా విషయంలో తలవంపులుండవు. ఆవిడ అందానికి తలొగ్గాను. చదువుకి తలొగ్గాను. సంస్కారానికి తలొగ్గాను... ఇప్పడు మీ ఎదుటా..."

'మరి... ఎందుకు ఈ దూరం...?'

'దూరం ఎక్కడండి? ఆవిడుండేది అశోక్‌నగర్‌లో నేనుండేది అబిడ్స్‌లో. ఎంత! ఫోన్‌కాల్ దూరం... అంతే...'

'బాబూ! అక్కడా ఇక్కడా ఫోన్లున్నాయి... కనెక్షన్లున్నాయి... మాటలున్నాయి. పలకరింపులున్నాయి.. కానీ మనుషులే దూరంగా...'

'లేదండీ ఫోనూ–రిసీవర్‌లాగా వుండిపోతాం. ఫోను కూడా కాదు, పేజరులా వుంటాం... అదీ కాదు సెల్లార్ ఫోనులా.. ఉగాదొచ్చింది... మీరొచ్చారు. మీకు షష్టిపూర్తి వచ్చింది. మిమ్మల్ని చూశాక, విన్నాక, చదివాక యింకా బతుకు భారం చేసుకుంటే ఏలా? మనసున మల్లెల మాలలూగే వేళలు... గతం నాస్తి...'

'రామకృష్ణా... హంస నీ కోసమే సందేశం తయారుగా వుంచింది.'

'లేదండీ... మీ రాకతో మా జీవితం రసాన్వితమైంది. బ్రతుకంటే పోరాటం కాదు... భవిష్యత్ కోసం సంపాదించి దాచడం కాదు. పంతాలు కాదు... అధికారాలు విజయాలు కాదు.. జీవించడం! సుఖంగా శాంతిగా జీవించ డం! మంగళవారం నాడొచ్చినా ఉగాది మాకు మంచే చేసింది'

అది గబ గబా పరమహంస.

అందరి మనస్సుల్లో... ముఖాల్లో... ఉగాది కళ

● మినీకథ

# బూచి



అంతవరకూ మండిన పొయ్యి ఒక్కసారి ఆరిపోవటంతో తిరిగి వెలిగించటానికి నానా తంటాలు పడుతోంది శివమ్మ. ఈ మధ్య మూడు రోజులై ముసురు వలన ఎండు కట్టెలు కరువైనాయి.

సరిగ్గా అప్పడే బయట వీధి వాకిట్లోంచి ఏడుపు వినిపించింది.

"ఏటే సత్తీ! ఏందే గోల" మండుతున్న కళ్లను ఓ చేత్తో తుడుచుకుంటూ కేక పెట్టింది శివమ్మ.

అట్నుంచటే బాణంలా వచ్చింది సత్తి

"సూడమ్మా! తమ్ముడు... నా నోట్స్ రాసుకోకుండా పెన్నిమ్మని పంతం పడుతున్నాడు..." ఏడుస్తూ చెప్పింది.

"ఏదీ నేనొత్తానుండు" అని గబగబ వెళ్ళి నాలుగేళ్ల బుడ్డిగాడిని కోపంగా చూస్తూ– "ఏట్రా నీకు పెన్ను గావాలంట్రా! నా కొడకా! ఏదీ ఆ పెన్ను బూచేదీ సెబ్తాను..." అని కూతురు చేతిలో పెన్ను మూతతీసి వాడి కళ్లకి దగ్గర పెట్టి పొడుస్తున్నట్లుగా భయపెడ్తూ... "ఇదిగో పెన్ను బూచిని పిల్సేదా... ఏడుపాపుతావా!" అంది శివమ్మ.

"ఇద్గో... ఈడేదుత్తే... ఈ పెన్ను బూచిని పిలు..." అని వెళ్ళిపోయింది.

వాడు ఏడ్చినప్పడల్లా పెన్నుతో భయపెడ్తూనే నోట్స్ పని కానిచ్చింది సత్తి.

శివమ్మ అన్నం వార్చుదించాక పిల్లలిద్దరికి తినిపించి తను కూడా ఎంగిలపడ్డది. కిటికీ దగ్గర పిల్లలు ఆడుకోసాగారు.

అప్పడే వీధిలోంచి రబ్బరు బొమ్మలు అమ్మేవాడు అరుస్తూ పోతున్నాడు. అది చూసింది మొదలు బొమ్మ కావాలంటూ పేచీ పెట్టసాగాడు బుడ్డిగాడు.

"అమ్మా! సూడే! తమ్ముడు.. నానా పేచీలూను.. బొమ్మ కావాలంట..." ఫిర్యాదు చేసింది సత్తి.

"ఉండు నే నొత్తన్నాను... ఏరా నీకేటి బొమ్మ కావాల్నా..." "ఊ... ఊ.. కావాలీ... కావాలీ..." కళ్లంట నీళ్లు కారుస్తూ వీధివంక చూపిస్తూ ఏడ్చాడు.

"మన దగ్గర కాసులు మూటేం కూసోనేదురా! నీ కివ్వటాన్కి... ఏడుపు మాన్తావా! లేదా!..." కోపంగా అంది శివమ్మ.

"ఊ... కావాలీ..." ఏడుపు హెచ్చించాడు.

"ఉండు నీ పనిలాక్కాదు. ఏదో బొమ్మ బూచిని పిలుచుకు వత్తాను" అని లోనికి వెళ్లి వెంట్రుకల చుట్టను బొమ్మలా మడిచి తెచ్చి బుడ్డిగాడి కళ్ల దగ్గర ఆడించి భయపెట్టింది.

"అమ్మో! అమ్మో!" అంటు వెరపుగా చేతులడ్డం పెట్టుకున్నాడు. మరోసారి భయపెట్టి లోపలికి వెళ్లిపోయింది శివమ్మ.

బుడ్డిగాడు అక్క ఒడిలో వాలిపోయి నిద్రపోయాడు.

శివమ్మ నడుం వాల్చింది.

సరిగ్గా అప్పడే వీధిలోంచి వచ్చాడు ఎరకయ్య.

"ఏటే నా నొచ్చేసరికే పడకేసినావే! నా కిన్ని గెంజి మెతుకులు ఎట్టాలని తెల్వదా!" తూలుకుంటూ వచ్చి కంచం వద్ద తిష్టవేశాడు.

"ఏటీ మావా! మల్లా తాగినావా!" బాధగా అంది.

"మల్లేటి మల్లేటి... ఇంకా తాగుతూనే వుంటా.. నువ్వెవతివే సెప్పటాన్కి... నా యిష్టం.." అని శివమ్మ జుత్తు పట్టుకుని వీపువంచి నాలుగు పిడి గుద్దులు గుద్దాడు.

నేలమీదికి ఒరిగిపోయింది శివమ్మ.

ఎరకయ్య తనే వడ్డించుకుని తినేసి తూలుకుంటూ వెళ్ళిపోయాడు.

తల్లి బాధ చూడలేక కళ్లనీళ్ళు పెట్టుకుంది సత్తి.

"అమ్మా! తమ్ముడేదడిగినా దాన్ని మాన్పించటాన్కి, బూచిని సూచించి బయం పెడ్తన్నావు. ఆడుకూడా ఒల్లక వూరుకుంటున్నాడు. మరి అయ్య సేత సారా మాన్పించటాన్కి సారా బూచితో బయంపించకూడదు... అసలు సారా బూచి లేదామ్మా!!" అమాయకంగా అడిగింది సత్తి.

"లేకేమమ్మా... సారా బూచి వుంది. కానీ, కానీ దానికి మీ అయ్యే కాదు... ఈ జెనాలెవరూ బయపడ్డం నేదు.. . అది మనలాటి వాళ్ల దురదృష్టం..."

కూతురి ఒళ్లో తల వాల్చేసి ఏడ్చింది.

బిక్క చచ్చిపోయింది సత్తి.

కె.కె.రఘునందన్